సాక్షి కామారెడ్డి

బుధవారం । 8 । మే । 2024



వ్యాపారులకు అండగా ఉంటాం

వ్యాపారులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- IIIలో ▸



మోదీనే మళ్లీ ప్రధాని

కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీనేనని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
45.8 /26.2

వాతావరణం

ఉదయంనుంచే ఎండల తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

11న ప్రియాంకా గాంధీ సభ



కామారెడ్డి రూరల్: కామారెడ్డిలో ఈనెల 10న నిర్వహించాల్సిన ప్రియాంక గాంధీ బహిరంగ సభ 11వ తేదీకి వాయిదా పడిందని ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్ తెలిపారు. సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర జరుగుతోందన్నారు. మోదీ నియంత పాలనను అంతమొందించి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ పార్లమెంట్ సమన్వయ కర్త, కేరళ ఎంపీ రాజామోహన్ ఫున్నన్ తదితరులు పాల్గొన్నారు.

పతి కోసం సతి ప్రచారం



దోమకొండ: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ భార్య అరుణ పాటిల్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరారు. ఆమె వెంట బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కంది మనోజ్‌కుమార్, మోహన్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్‌కు అంతరాయం



దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మూడు గంటల పాటు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బలమైన గాలుల వల్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతో సమస్య ఏర్పడిందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న కళాశాలల తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో అనుబంధ గుర్తింపు తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం నవీపేట్‌లోని మేధా డిగ్రీ కాలేజీ, బోధన్‌లోని ఉషోదయ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, విజయసాయి మహిళా డిగ్రీ కాలేజీ, ఎస్‌వీ, ఉషోదయ మహిళా డిగ్రీ కాలేజీ, ఎంఐఎంఎస్, ఇందూరు డిగ్రీ కళాశాలలు తనిఖీ చేసినట్లు వర్సిటీ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. సరైన సౌకర్యాలు లేని కళాశాలలకు నోటీసులు అందించినట్లు తెలిపారు. విజయసాయి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో కనీసం టేబుల్స్ సైతం లేకపోవడంతో కాళ్లపైనే రిజిస్టర్లు పెట్టుకుని తనిఖీ చేయాల్సి రావడంతో వర్సిటీ అధికారులు అసహనానికి లోనయ్యారు. ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ, డీన్లు ఆరతి, రాంబాబు, లావణ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రజలు

మాట్లాడుతున్న కేసీఆర్

జిల్లా ఉండన్నా? పోవన్నా..?

కామారెడ్డి జిల్లా తీసేస్తరట అంటూ కేసీఆర్ మరోసారి చర్చకు తెర లేపారు. ''ఒక మాట చెప్పాలె. కామారెడ్డి జిల్లా ఉండన్నా? పోవన్నా? కాంగ్రెసోళ్లు తీసేస్త అంటుండ్రు. కాపాడుకుంటరా? పోగొట్టుకుంటరా? మీ ఇష్టం'' అంటూ కేసీఆర్ కామారెడ్డి కార్నర్ మీటింగ్‌లో ప్రస్తావించారు. పరిపాలనా సౌలభ్యం కోసం మనం కామారెడ్డి జిల్లాను ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త జిల్లాలను తీసేస్తా అంటుంటే చూస్తూ ఊరుకుందామా అని ప్రశ్నించారు. దీంతో ప్రజలు జిల్లా ఉండాల్సిందేనని నినాదాలు చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్నా, కామారెడ్డి జిల్లాను కాపాడుకోవాలన్నా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కేసీఆర్ కోరారు. జిల్లా రద్దు చేస్తారట అన్న కేసీఆర్ వ్యాఖ్యలు అంతటా చర్చనీయాంశంగా మారింది.

జేబు దొంగల చేతివాటం

సందట్లో సడేమియా అన్నట్టుగా కేసీఆర్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో జేబు దొంగలు చేతివాటాన్ని ప్రదర్శించారు. మీటింగ్‌కు వచ్చిన పలువురు నాయకులు, కార్యకర్తల పర్సులు, సెల్‌ఫోన్లు దొంగలించారు.

బీఆర్‌ఎస్‌లో నయా జోష్!

అసెంబ్లీ ఎన్నికలలో ఓటమితో డీలా పడిన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఆ పార్టీ దళపతి కేసీఆర్ కదలిక తెచ్చారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలపై పదునైన విమర్శలతో కార్యకర్తల్లో హుషారు నింపారు. మంగళవారం రాత్రి కామారెడ్డి పట్టణంలో కేసీఆర్ నిర్వహించిన బస్సు యాత్ర విజయవంతం కావడంతో గులాబీ దళంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

- కామారెడ్డిలో కేసీఆర్ ఎన్నికల ప్రచారం
- మోదీ, రేవంత్‌లు టార్గెట్‌గా ప్రసంగం
- విజయవంతమైన రోడ్‌షో, కార్నర్ మీటింగ్

సాక్షి, కామారెడ్డి : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 5 గంటలకు కామారెడ్డికి చేరుకోవాల్సిన కేసీఆర్ బస్సుయాత్ర.. ఆలస్యంగా రాత్రి 7.25 గంటలకు చేరుకుంది. నిజాంసాగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. అక్కడినుంచి ప్రారంభమైన రోడ్ షో రైల్వే బ్రిడ్జి, స్టేషన్ రోడ్డు, ఇందిరా చౌక్, సిరిసిల్లా రోడ్డు, జేపీఎన్ రోడ్డు మీదుగా జేపీఎన్ కూడలి వరకు సాగింది. మెదక్‌లో నిర్వహించే సభలో పాల్గొనాల్సి ఉండడంతో కేసీఆర్ ఇతర నేతలకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నేరుగా మైక్ అందుకుని ప్రసంగాన్ని ప్రారంభించారు. 7.58 గంటలకు ప్రసంగాన్ని మొదలుపెట్టి 8.14 గంటలకు ముగించారు.



మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే పోచారం, గంప, ముజీబొద్దీన్

దారి పొడవునా..

రోడ్‌షోలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల నుంచే కాకుండా బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల నుంచి కూడా బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి కామారెడ్డికి వచ్చిన కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి జేపీఎన్ చౌరస్తా వరకు సాగిన బస్సు యాత్రలో ఉత్సాహంగా నడిచారు.

ప్రభుత్వాలపై విమర్శలు..

కేసీఆర్ తన ప్రసంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిలపై ఆరోపణలు, విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అసమర్థులు, తెలివితక్కువ వారి చేతుల్లో రాజ్యం ఉందన్నారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమైందని, రూపాయి విలువ పడిపోయి అంతర్జాతీయంగా ప్రతిష్ట దెబ్బతిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత పలువురు నేతలు పార్టీని వీడి వెళ్లారు. ఇటీవల వలసలు పెరగడంతో క్యాడర్‌లో నైరాశ్యం అలుముకుంది. కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేసి ఓటమి చెందడం, రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత చాలామంది నాయకులు పార్టీని వీడి వెళ్తున్న నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో పట్టు నిలుపుకునే ప్రయత్నంలో భాగంగా కేసీఆర్ ప్రత్యర్థులపై విమర్శలకు ప్రాధాన్యత ఇచ్చారని భావిస్తున్నారు.



రోడ్‌షోలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు, బస్సులో కేసీఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గంప గోవర్ధన్

దేశాన్ని ముక్కలు చేసింది కాంగ్రెస్సే

- బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు

గాంధారి: దేశాన్ని ముక్కలు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం సుస్థిరంగా, భద్రంగా ఉంటుందన్నారు. మండల కేంద్రంలోని హరాశే గార్డెన్స్‌లో మంగళవారం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీజేపీ ఎస్టీ మోర్చా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మురళీధర్‌రావు మాట్లాడుతూ మోదీ మళ్లీ ప్రధాని అయితే రిజర్వేషన్లు ఎత్తేస్తారని కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు అబద్ధపు చెబుతున్నాయని ఆరోపించారు. దేశ భద్రతతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలు అభివృద్ధి చెందాలంటే మోదీనే మళ్లీ ప్రధాన మంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి ఒక్కరు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, తానాజీరావు, పైలా కృష్ణారెడ్డి, మధుసూదన్ రావు, మోజీరాం నాయక్, కాత్రోత్ రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీధర్‌రావు



తప్పనిసరిగా ఓటు వేయాలి

- 5కే రన్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేయడానికి మంగళవారం జిల్లాకేంద్రంలో 5కే రన్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన రన్.. కొత్త బస్టాండ్ మీదుగా ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం స్టేడియంలో విద్యార్థులతో ఓటు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయడానికి ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పోలింగ్ కేంద్రానికి రావడానికి వృద్ధులు, దివ్యాంగులకు రవాణా సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశం, జిల్లా అధికారులు నాగరాజు, వెంకట్‌రెడ్డి, సాయిలు, ఆర్కే విద్యా సంస్థల సీఈవో జైపాల్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాజేందర్ రావు, శ్రీకాంత్, ఎన్‌సీసీ వలంటీర్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.



5కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

రేపు బాన్సువాడకు రాజ్‌నాథ్‌సింగ్ రాక

బాన్సువాడ: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం బాన్సువాడకు రానున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. మంగళవారం ఆయన పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి పెద్దోల్ల గంగారెడ్డితో కలిసి బాన్సువాడలోని వీక్లీ మార్కెట్‌లో పర్యటించి, సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. గాడిద గుడ్డు అంటూ తనను తాను కించపరచుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. రాజ్‌నాథ్‌సింగ్ సభకు బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలనుంచి ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుడుగుట్ల శ్రీనివాస్, పైడిమల్ లక్ష్మీనారాయణ, కోనాల గంగారెడ్డి, పాశం భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, అశ్విన్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న యెండల లక్ష్మీనారాయణ

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో

ఖలీల్‌వాడి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నిజామాబాద్ నగరం, ఆర్మూర్‌లలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు తెలిపారు. రోడ్ షోతో పాటు కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

రూట్ మ్యాప్ వివరాలు

ఆర్మూర్‌లోని ఆలూర్ బైపాస్, జమ్మన్‌జట్టి గల్లీ, గోల్‌బంగ్లా, పాత బస్టాండ్ మీదుగా రోడ్ షో సాగుతోంది. అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. నగరంలోని గోల్ హనుమాన్ చౌరస్తా, ఆర్యసమాజ్, బడా బజార్, పోస్ట్ ఆఫీస్ మీదుగా రోడ్ షోలో పాల్గొనున్న సీఎం నెహ్రూ పార్క్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

సీఎం పర్యటన సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని సీపీ కల్మేశ్వర్ తెలిపారు.

- పూలాంగ్ చౌరస్తా నుంచి నగరంలోనికి వచ్చే వాహనాదారులు ఆర్ ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా, బోధన్ బస్టాండ్ మీదుగా గాంధీ చౌక్ వరకు.
- కంఠేశ్వర్ వైపు నుంచి వచ్చే వాహనాదారులు ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, ఫ్లై ఓవర్ నుంచి బస్టాండ్‌కు.
- బోధన్ వైపు నుంచి రాకపోకలు సాగించే వాహనాలు అర్సపల్లి రైల్వే గేటు మీదుగా కొత్త కలెక్టరేట్ వైపు నుంచి ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా, శివాజీ చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు రావాలి.
- హైదరాబాద్ నుంచి వచ్చి పోయే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్, ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా మీదుగా రాకపోకలు సాగించాలి.
- ఆర్మూర్ రాకపోకలు సాగించే వాహనదారులు కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్ వైపు నుంచి ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా, శివాజీ చౌరస్తా మీదుగా వెళ్లాలి.
- బాన్సువాడ వైపు నుంచి వచ్చి, పోయే వాహనాలను వర్ని చౌరస్తా నుంచి ఖిల్లా చౌరస్తా, బోధన్ బస్టాండ్, అర్సపల్లి రైల్వే గేటు మీదుగా కొత్త కలెక్టరేట్ వైపు నుంచి ఖానాపూర్ ఎక్స్ రోడ్డు, దుబ్బ చౌరస్తా, శివాజీ చౌరస్తా మీదుగా మళ్లిస్తారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: అమ్మ ఆదర్శ పాఠశాలలలో చేపట్టిన పనులను విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. మంగళవారం టేక్రియాల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలను, మున్సిపల్ నర్సరీని, చౌరస్తాలో ఉన్న అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్‌ను సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన ప్రహరీ మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను, నర్సరీలో పెంచుతున్న వట్టివేరు మొక్కలను పరిశీలించారు. అనేక ఔషధ గుణాలు కలిగిన వట్టివేరు మొక్క ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. వట్టివేరు మొక్కలను చెరువు కట్టలపై పెంచాలని, వాటి వేర్లు 10–15 అడుగుల లోతువరకు వెళ్లి కట్టకు బుంగ పడకుండా కాపాడుతాయని పేర్కొన్నారు. ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలని చెక్‌పోస్టు సిబ్బందికి సూచించారు. కార్యక్రమాలలో ఇంజినీరింగ్ అధికారులు సుబ్బారాయుడు, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



టేక్రియాల్‌లోని పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్లుప్తంగా

'ప్రేరణ'కు జ్యోతీబా పూలే విద్యార్థిని భవిజ్ఞ



భిక్కనూరు : దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే ప్రేరణ కార్యక్రమానికి భిక్కనూరు మండలం జంగంపల్లి మహాత్మాజ్యోతీబా పూలే పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థిని భవిజ్ఞ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మణిదీప్తి మంగళవారం తెలిపారు. గుజరాత్‌లో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే ఈ ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా అనేక రకాల పరీక్షలను నిర్వహించి 20 మందిని ఎంపిక చేశారన్నారు. ఈ 20 మందిలో మన రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికవ్వగా అందులో జంగంపల్లి జ్యోతీబా పూలే పాఠశాలకు చెందిన భవిజ్ఞ ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని భవిజ్ఞను ప్రిన్సిపాల్ మణిదీప్తి, ఉపాధ్యాయులు రాధిక, పావని, సుప్రియ, గంగసాగర్, లావణ్య, పర్హా అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: 'తెలంగాణ రత్న తెలంగాణ కీర్తి, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డులను అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్' అకాడమీ(సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారులకు వారి ప్రతిభ, సేవలను గుర్తించి పురస్కారం అందజేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ అకాడమీ, ఇంటినెంబర్ 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు: తిరుమలగిరి, సికింద్రాబాద్-15కు పంపాలని, పూర్తి వివరాల కోసం 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సౌకర్యాలు కల్పించండి



నిజామాబాద్‌అర్బన్: ఎన్నికల సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్ కోరారు. ఈమేరకు మంగళవారం వారు నగరంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. రికార్డు స్థాయిలో ఎండలు ఉండడంతో పోలింగ్ బూత్‌లలో కూలర్లను ఏర్పాటుచేయలన్నారు. చల్లని నీరు, బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు.

టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్ ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే డాక్టర్ కిరణ్‌మాదాల ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కిరణ్ బొల్లేపాక, కోశాధికారిగా డాక్టర్ ఎల్ రమేశ్, ఉపాధ్యక్షులుగా సుమలత, ప్రకాశ్ ఎన్నికయ్యారు.

వెలవెలబోతున్న 'వరప్రదాయిని'

- కనిష్ట స్థాయికి ఎస్సారెస్పీ నీటిమట్టం
- గతేడాది నిల్వ ఉన్న నీరు 21.74 టీఎంసీలు..
- ఈ ఏడాది 10.24 టీఎంసీలు

ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా చెప్పుకునే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం తగ్గిపోయి వెలవెలబోతోంది. గతేడాది ఇదే నెలలో 21.74 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ ఏడాది కేవలం 10.24 టీఎంసీలు ఉంది. 2019 తరువాత ఈ స్థాయికి నీటి మట్టం పడిపోవడం ఇదే తొలిసారి.



నీరులేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సగానికి పడిపోయింది. యాసంగి పంటలకు వరద కాలువ ద్వారా దిగువకు నీటిని విడుదల చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రాజెక్ట్‌లో ఇదేరోజున 21.74 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుత సంవత్సరం 10.24 టీఎంసీలు నిల్వ ఉంది. అంటే సగానికంటే ఎక్కువే తేడా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుందని ప్రాజెక్ట్ అధికారులు అంచనాలు వస్తూ గోదావరిలోకి 62 టీఎంసీల నీటిని వదిలారు. కానీ ఒక్కసారిగా ఎగువ ప్రాంతాల నుంచి వరద నిలిచిపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గిపోయింది. యాసంగి పంటలు గట్టెక్కుతాయో లేదోనని అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ పంటలు గట్టెక్కాయి. ప్రస్తుతం తాగు నీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నారు.

వరద రాకుంటే తిప్పలు తప్పవు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వచ్చే ఖరీఫ్‌లో సకాలంలో వరద రాకుంటే తాగు నీటికి సైతం తిప్పలు తప్పేలా కనిపించడం లేదు. ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిలో 5టీఎంసీలు డెడ్ స్టోరేజీ, మరో రెండు టీఎంసీలు ఆవిరి రూపంలో పోతే మిగిలేది 3 టీఎంసీలు మాత్రమే. కానీ తాగు నీటి అవసరాల కోసం ప్రాజెక్టులో 5 టీఎంసీల నీరు నిల్వ ఉండాలి. ఎగువ పాతాల నుంచి సకాలంలో వరద రాకున్నా, వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా తాగునీటికి కటకట తప్పేలా లేదు. ఉన్న నీటిలో ప్రతి నీటిచుక్కను సద్వినియోగం చేసినా ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రాజెక్టులో 2019 తరువాత కనిష్ట స్థాయికి నీటి మట్టం తగ్గడం ఇదే తొలిసారి. 2019లో ప్రాజెక్టులో నీటి నిల్వ 9 టీఎంసీలకు పడిపోయింది.అంతకు ముందు 2015లో ఎగువ ప్రాంతాల నుంచి చుక్క నీరు రాకపోవడంతో డెడ్‌స్టోరేజీ దిగువకు పడిపోయింది. ఆ తరువాత 2019లో 9 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుత సంవత్సరం కూడా ఖరీఫ్ ప్రారంభం నాటికి నీటి నిల్వ గణనీయంగాపడే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి 1056.3(10.24 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న తిప్పాపూర్ గ్రామస్తులు



కాంగ్రెస్‌లో చేరిన పోచారం గ్రామస్తులు



కాంగ్రెస్ చేరిన బీజేపీ కార్యకర్తలు

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామస్తులు 150 మంది కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. వీరందరికి ప్రభుత్వ సలహదారు షబ్బీర్ అలీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యాక్షుడు కుంట లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని పోచారంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పోచారం బీఆర్ఎస్ పార్టీలో పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి అశోక్, గ్రామ అధ్యక్షుడు చంద్రకాంత్ సర్పంచ్ మానెవ్వ మొగులయ్యలతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల నాయకులు బేగంపూర్, బేగంపూర్ తండా,కాస్లాబాద్ గ్రామల్లో ప్రచారం నిర్వహించారు. నాగిరెడ్డి, చిప్ప మోహన్, శ్యామప్ప పటేల్, మల్లప్ప పటేల్ తదితరులున్నారు.

కామారెడ్డి రూరల్ నుంచి..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలోని బీజేపీ పార్టీకి చెందిన 20 మంది యువకులు రాష్ట ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పండ్ల రాజు, కారంగుల అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీఆర్ బస్సుపై పూలవర్షం



మాజీ సీఎం కేసీఆర్ బస్సుపై పూలు చల్లేందుకు వేచి చూస్తున్న మహిళలు



బస్సుపై పూలు చల్లుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

డిచ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు డిచ్‌పల్లి వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం డిచ్‌పల్లికి కేసీఆర్ ప్రయాణిస్తున్న ప్రత్యేక బస్సు చేరుకోగానే నాగాపూర్ గేట్ వద్ద బస్సుపై మహిళలు, పార్టీ నాయకులు పూల వర్షం కురిపించారు. బస్సులో నుంచే కేసీఆర్ పార్టీ శ్రేణులకు చేశారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులతో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ ముత్తన్న

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణను సద్వినియోగం చేసుకొని క్రీడాపోటీల్లో రాణించాలని జిల్లా యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ ముత్తన్న సూచించారు. మండలంలోని మిట్టపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా యూత్, స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం సాయంత్రం ముత్తన్న సందర్శించారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడాపరికరాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కబడ్డీ కోచ్ ప్రశాంత్, సురేశ్, శిక్షణ శిబిరం కోచ్ మర్కంటి గంగామోహన్, కోచ్ హెచ్ అనికేత్, సీనియర్ క్రీడాకారులు సెంథిల్, అంజలి, గంగాధర్, వినయ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ చెల్లనిది అక్కడ చెల్లుతోంది

- రూ.10, 20 నాణేలు తీసుకోని వ్యాపారులు, ప్రజలు
- మహారాష్ట్రలో చలామణి అవుతున్నా ఇక్కడ నిరాకరణ



రూ.పది, ఇరవై నాణేలు



కామారెడ్డిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్డు

కామారెడ్డి అర్బన్: గుగుల్‌పే, ఫోన్ పే వంటి ఆన్‌లైన్ చెల్లింపులతో చిల్లర సమస్య కొద్దివరకు తీరినప్పటికీ కూరగాయలు, కిరాణాషాపుల్లో పరిస్థితి అలాగే ఉంది. చిల్లర సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.1, 2, 5, 10, 20 నాణేలను విరివిగా మార్కెట్‌లోకి విడుదల చేస్తోంది. అయితే కామారెడ్డిలో అనేక మంది రూ.10, 20 నాణేలను తిరస్కరిస్తున్నారు. బ్యాంకులు వ్యాపారులకు నాణేలను నిర్బంధంగా ఇస్తుండగా.. దుకాణాల్లోకి వస్తున్న వినియోగదారులు మాత్రం వ్యాపారుల నుంచి రూ.10, 20 నాణేలు తీసుకోవడం లేదు. తమ వద్ద జమైన వేలాది రూపాయల 10, 20 నాణేలను మహారాష్ట్రకు వెళ్లి మార్పిడి చేయాల్సి వచ్చిందని పలువురు వ్యాపారులు వాపోయారు. మహారాష్ట్రలో చలామణిలో ఉన్న రూ.10, 20 నాణేలు ఇక్కడ తిరస్కరిస్తుండడం విచారకరమని, బ్యాంకు అధికారులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరుతున్నారు. గతంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.10 నాణేల చెల్లుబాటు విషయంలో ప్రకటన చేసినప్పటికీ ప్రజలు, వ్యాపారుల్లో మార్పు రావడం లేదని అంటున్నారు. ఇక బ్యాంకుల్లో సైతం రూ.10 నాణేలు పదికంటే ఎక్కువ డిపాజిట్‌గా తీసుకోవడం లేదని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతోనే పరిస్థితి ఇలా ఉందని భావించిన పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద కిరాణదుకాణం నడిపే పప్పుల శ్రీకాంత్ ఏకంగా బోర్డు ఏర్పాటు చేశారు. రూ.10, రూ.20 నాణేలను తాము తీసుకుంటామని, అలాగే చిల్లర అవసరమైనప్పుడు ఇస్తామని ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేశారు.

సమస్యను పరిష్కరించాలి



చిల్లర సమస్యపై ప్రభుత్వం ప్రజలను చైతన్యం చేయాలి. మహారాష్ట్రలో రూ.10, 20 నాణేల చలామణిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. తెలంగాణలోనే సమస్య ఎక్కువగా ఉంది. మా దుకాణానికి వచ్చే వినియోగదారులకు చిల్లర ఇవ్వడంతోపాటు చిల్లర తీసుకుంటామని అవగాహన కల్పిస్తూ బోర్డు ఏర్పాటు చేశాం. ఇలాగే పట్టణంలోని అన్ని దుకాణాల్లోనూ ఏర్పాటు చేస్తే ప్రజల్లో చైతన్యం వస్తుంది. చిల్లర సమస్య పరిష్కారమవుతుంది.

– పప్పుల శ్రీకాంత్, కిరాణావ్యాపారి, కామారెడ్డి

ఐడియా అదిరింది..!



ఎండ తగలకుండా బైక్‌కు ఏర్పాటు చేసిన రక్షణ కవచం

మద్నూర్(జుక్కల్): వేసవి ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. బయటకు వెళ్లి పనులు చేసుకుందామంటే ఎండ తీవ్రతకు ఆరోగ్యం దెబ్బతింటోంది. బైక్ మీద ప్రయాణం చేస్తే వడగాలుల దెబ్బకు చలి మంట ముందు కూర్చున్నట్లు ఉంటోంది. దీంతో బైక్‌కు రక్షణ కవచం ఏర్పాటు చేసుకోని ఎండలో కూడా హాయిగా తన పనులు చేసుకుంటున్నాడు హన్మంత్. వివరాలు.. డోంగ్లీ మండలంలోని దోతి గ్రామానికి చెందిన హన్మంత్ తన బైక్‌కు హైదరాబాద్‌లో రూ.7,500 ఖర్చు పెట్టి రక్షణ కవచం ఏర్పాటు చేయించారు. ఎండ, వడగాలులు కూడా తగలకుండా హాయిగా ప్రయాణం చేయొచ్చని ఆయన చెప్పారు. మంగళవారం మద్నూర్‌లో హన్మంత్ తన బైక్‌పై వెళ్తుండగా సాక్షి క్లిక్ మనిపించింది.

క్రైం కార్నర్

గడ్డివాము దగ్ధం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం మిర్దాపల్లిలో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుంది. సమీపంలోని వ్యవసాయభూమిలో వరికొయ్యలకు నిప్పుపెట్టగా, గాలిదుమారానికి మంటలు వేగంగా వ్యాపించి సమీపంలో రైతులు నిల్వ చేసి ఎండుగడ్డికి అంటుకున్నాయి. రైతుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారని అగ్నిమాపకశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు.

జహీరాబాద్‌లో గెలిచేది కాంగ్రెస్సే

- పార్టీ అబ్జర్వర్ రాజ్‌మోహన్



ఎల్లారెడ్డి: జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ అబ్జర్వర్, కేరళ ఎంపీ రాజ్‌మోహన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ గెలుపు కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఎంతగానో కష్టపడటం సంతోషకరమని అన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత రావడం ఖాయమన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సామెల్, సాయిబాబా, షెకావత్, గఫార్, ఆరిఫ్ తదితరులున్నారు.

అనారోగ్యంతో తల్లి.. బెంగతో కూతురు మృతి

- బాన్సువాడ మండలం బోర్లంలో ఘటన
- ఒకేచోట తల్లీకూతుళ్ల అంత్యక్రియలు



చోటీ బీ (ఫైల్)



రజియా బీ (ఫైల్)

బాన్సువాడ రూరల్: తల్లి చనిపోయిందనే బెంగతో 12గంటల వ్యవధిలో కూతురు మృతి చెందిన ఘటన బాన్సువాడ మండలం బోర్లంలో చోటుచేసుకుంది. తల్లీకూతుళ్ల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోర్లం గ్రామానికి చెందిన కాటేపల్లి చోటీ బీ(80) గత కొంతకాలంగా బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వరకాలనీలో చిన్నకూతురు రజియా బీ(60) వద్ద ఉంటోంది. అనారోగ్యంతో బాధపడుతున్న చోటీ బీ సోమవారం రాత్రి 11గంటలకు మృతి చెందగా, కూతురు రజియా బోరున విలపిస్తూ సొమ్మసిల్లి పడిపోవడంతో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం చోటీ బీ మృతదేహాన్ని బోర్లంకు తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా తల్లి మృతదేహం వద్ద రజియా బీ రోదిస్తూ అస్వస్థతకు గురై మృతి చెందింది. తల్లీకూతుళ్ల అంత్యక్రియలను మంగళవారం సాయంత్రం ఒకేసారి నిర్వహించారు.

పరిస్థితి విషమించి యువకుడు..



ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మండలంలోని కళ్యాణి గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జగదీశ్(32) గత గురువారం కామారెడ్డి నుంచి బైక్‌పై కళ్యాణికి వస్తుండగా లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామశివారులో అడవిపందులు అడ్డువచ్చాయి. ఈ ఘటనలో బైక్ అదుపు తప్పి జగదీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడాది కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వాగులో పడి వృద్ధురాలు..

నవీపేట: మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జిట్టవేణి అబ్బాయి(62) మండలంలోని జన్నేపల్లి వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. అబ్బాయికి మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 6వ తేదీన రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. మంగళవారం సాయంత్రం అబ్బాయి వాగులో శవమై కనిపించింది. మృతురాలి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

త్వరగా నిద్రలేవమన్నందుకు చెరువులో దూకి ఆత్మహత్య

రెంజల్(బోధన్): ఉదయం త్వరగా నిద్రలేవాలని భర్త మందలించడంతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గాజ సాయిలు, గాజ లావణ్య(36) భార్యాభర్తలు. ప్రతి రోజూ ఉదయం లావణ్య ఆలస్యంగా నిద్రలేస్తుండడంతో భర్త మందలించేవాడు. మంగళవారం కూడా లావణ్య ఆలస్యంగా నిద్రలేవడంతో సాయిలు మందలించాడు. దీంతో క్షణాకావేశంలో లావణ్య ఇంట్లో నుంచి బయటికి వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లి విడిచివెళ్లిపోయిందని యువకుడు..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తండ్రి మృతి చెందగా, తల్లి తనను విడిచివెళ్లిపోయిందని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మల్లయ్యపల్లి గ్రామ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన బేస్త కృష్ణ (20) గొర్రెలు మేపేందుకు మంగళవారం ఉదయం మల్లయ్యపల్లి శివారుకు వెళ్లాడు. అయితే, కృష్ణ తండ్రి గతంలో మృతి చెందగా, తల్లి సైతం అతడిని వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జీవితంపై విరక్తితో ఉన్న కృష్ణ మంగళవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్దనాన్న బీరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.